సాక్షి
నిర్మల్
మంగళవారం । 2 । జనవరి । 2024



ట్రిపుల్.. ట్రబుల్స్ తీరేనా?
ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేక సమస్యలు పరిష్కారం కాక బాసర ట్రిపుల్ ఐటీలో చదివే విద్యార్థులు ఇప్పటికీ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. 8లో▸



బాసరలో భక్తుల రద్దీ
నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం బాసర సరస్వతీ ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ నెలకొంది. 10లో▸

గరిష్టం/కనిష్టం
29.1 / 17.3

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

తాగింద్రు..ఊదింద్రు..!



చైన్‌గేట్ ఏరియాలోని ఓ వైన్‌షాపు ముందు బారులు తీరిన మందుబాబులు

- 30 శాతం వరకు పెరిగిన మద్యం అమ్మకాలు
- మందుబాబులతో కిటకిటలాడిన వైన్సులు
- హోటళ్లలో ఒక్కరాత్రికే రెండింతల గిరాకీ
- నాన్‌వెజ్ స్నాక్స్‌కు ఫుల్ డిమాండ్
- డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసుల సీరియస్
- ఒక్కరాత్రికే 26 కేసులు నమోదు

నిర్మల్: థర్టీ ఫస్ట్ నైట్.. ఏడాదంతా ఒక లెక్క. ఈ ఒక్కరోజు రాత్రి మరో లెక్క. సాయంత్రం ఆరు నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా సాగే జోష్ అంతా ఇంతా ఉండదు. పాత ఏడాదికి ఘనంగా వీడ్కోలు పలికేందుకు.. కొత్త ఏడాదికీ అదేస్థాయిలో వెల్‌కం చెప్పేందుకు వారం, పదిరోజుల ముందే చాలామంది రెడీ అవుతుంటారు. ఈసారి కూడా అలాగే చేశారు. జిల్లాలో గతేడాది చివరిరోజైన ఆదివారం రాత్రి ఫుల్ జోష్‌గా సాగింది. ఈ ఒక్క సాయంత్రమే మద్యం అమ్మకాలకు ఫుల్ కిక్కునిచ్చింది. జిల్లాలో డిసెంబర్ నెలాఖరు రెండురోజుల్లోనే 20 నుంచి 30 శాతం మద్యం అమ్మకాలు పెరిగాయి. థర్టీఫస్ట్ రోజు సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు హోటళ్లలో నాన్‌వెజ్ స్నాక్స్, బిర్యానీలకు ఫుల్ గిరాకీ కొనసాగింది. ఈసారి పోలీసులూ సీరియస్‌గానే తీసుకున్నారు. ఏడాది చివరిరోజంటూ ఎంత ఎంజాయ్ చేసినా.. నిబంధనల ప్రకారమే అని ముందే స్పష్టం చేశారు. రాత్రిపూట డ్రంకెన్ డ్రైవ్ చేసిన వారిని వదిలిపెట్టలేదు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేశారు.

ఆదివారం కలిసొచ్చింది..
డిసెంబర్ 31 ఆదివారం రావడం మద్యం ప్రియులకు పండుగలా మారింది. ఇతర వారాలు వస్తే ఉపవాసాలు, పూజలంటూ చాలావరకు మద్యానికి దూరంగా ఉండాల్సి వచ్చేది. నాన్‌వెజ్ కూడా తినడం వీల్లేకుండా పోయేది. ఆదివారం రావడంతో దాదాపు ఉదయం నుంచే థర్టీఫస్ట్ సంబురాలు మొదలయ్యాయి. చాలామంది పొద్దున్నుంచే రోజంతా ఎంజాయ్ చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. కుటుంబాలతో కలిసి ఉండాలనుకునేవారు ఇంట్లోనే వంటకాలు చేసుకుని ఆస్వాదించారు. కొంతమంది స్నేహితులు, ఫ్యామిలీలతో కలిసి సమీప ఫామ్‌హౌస్‌లకు, వ్యవసాయక్షేత్రాలకు వెళ్లారు. అక్కడే కలిసి వంటలు చేసుకుని ఆటలాడుతూ ఎంజాయ్ చేశారు.

మందు.. రెండురోజుల ముందే..
థర్టీ ఫస్ట్ అంటేనే పార్టీ నైట్. ఇందులో మద్యానిదే పెద్దపాత్ర. మందుబాబులదే ఎక్కువ హంగామా. అందుకే మద్యం దుకాణాలూ ముందుగానే అన్నీ రెడీ చేసుకుంటాయి. డిసెంబర్ 31 ఆదివారం కావడంతో ఆ రోజు డిపోల నుంచి మద్యం తీసుకోవడం కుదరదు. అందుకే రెండుమూడు రోజుల ముందునుంచే కావాల్సిన మద్యం తెచ్చిపెట్టుకున్నారు. డిసెంబర్ 29, 30 తేదీల్లో సాధారణ రోజుల కంటే 20 నుంచి 30 శాతం మద్యం దుకాణాలకు తరలినట్లు ఆశాఖ అధికారులు చెబుతున్నారు. ఇక దుకాణాల్లో 31న ఒక్కరోజే 50 నుంచి 70శాతం వరకు మద్యం అమ్మకాలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఆరోజు సాయంత్రం మాత్రం ఏ వైన్స్ దగ్గర చూసినా జనం కిటకిటలాడుతూ కనిపించారు. ఇప్పటికీ గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్‌షాపుల్లోనూ చాలావరకు మద్యం ఖాళీ అయిపోయింది. దీంతో గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చి మరీ మద్యాన్ని కొనుక్కుని వెళ్లారు.

నాన్‌వెజ్‌కు ఫుల్ గిరాకీ..
మద్యం సుక్క తాగేవాళ్ల కంటే మాంసం ముక్కను తినేవాళ్లు ఎక్కువగా ఉంటారు. ఆదివారం కలిసిరావడంతో చికెన్, మటన్ షాపులు పొద్దున్నుంచే కిటకిటలాడాయి. సాధారణ ఆదివారాలతో పోలిస్తే ఈ ఒక్కరోజే మూడింతల మాంసం విక్రయాలు పెరిగాయి. జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్ ఉదయం నుంచి నిండిపోయింది. ఇక సాయంత్రం మందులో స్నాక్స్ కోసం జిల్లా కేంద్రంలో మెయిన్‌రోడ్డు పొడవునా తాత్కాలికంగా చాలా సెంటర్లు ఏర్పాటు చేశారు. పలు ప్రముఖ హోటళ్ల ఎదుట ప్రత్యేకంగా టెంట్లు వేసి కౌంటర్లు పెట్టారు. రాత్రి పన్నెండు దాటినా పలు హోటళ్లు, స్నాక్స్‌సెంటర్ల వద్ద సందడి కనిపించింది.

కేకుల కోసం..
పెద్దలందరూ మద్యం, మాంసాలతో ఎంజాయ్ చేస్తే.. న్యూఇయర్‌కు స్వాగతం పలికేందుకు చిన్నారులు కేకుల కోసం బయలుదేరారు. జిల్లా కేంద్రం, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోని బేకరీలన్నీ వివిధ రకాల కేకులతో నిండిపోయాయి. రూ.200 నుంచి రూ. వెయ్యి వరకు ధరలతో కేకులను విక్రయించారు. సాధారంగా రోజుకు పదివరకు కేకులను అమ్మే దుకాణాలు 31న సాయంత్రం నుంచి రాత్రి వరకు 100 నుంచి 200 కేకులను విక్రయించడం గమనార్హం. కేకులతో పాటు కూల్‌డ్రింకులు, బెలూన్లు భారీగా కొనుగోలు చేశారు. అలాగే కొంతమంది పటాకులను కొనుగోలు చేసి అర్ధరాత్రి 12 గంటలకు భారీగా పేల్చి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.



జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్)

డిసెంబర్ 29, 30న మద్యం కొనుగోలు(డిపోలలో)..

లిక్కర్ : 4,577 కేసులు
బీర్లు : 6,351 కేసులు
మొత్తం ఆదాయం : 5.09 కోట్లు

పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ కేసులు

నిర్మల్ : 18, భైంసా : 02,
ఖానాపూర్ : 06
మొత్తం : 26

చెప్పినట్లే చేసిన పోలీసులు..
థర్టీఫస్ట్ దావత్‌లు, న్యూఇయర్ సంబురాల పేరిట నిబంధనలను అతిక్రమించవద్దని, సాధారణ ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని జిల్లా పోలీసుశాఖ రెండు రోజుల ముందునుంచే హెచ్చరిస్తూ వచ్చింది. ఎప్పుడూ ఇలాగే చెబుతారులే.. అని చాలామంది మందుబాబులు థర్టీఫస్ట్ నైట్ ఫుల్‌గా తాగి బండిపై రోడ్డెక్కారు. అలాంటి వారిని పోలీసులు పరీక్షించి, మోతాదుకు మించి మద్యం సేవించి ఉంటే కేసులు నమోదు చేశారు. ఈసారి జిల్లాకేంద్రంలో రోడ్లపై ఇష్టారీతిన దుకాణాలను ఏర్పాటు చేయనివ్వకుండా ముందే అడ్డుకున్నారు.

అప్రమత్తతతోనే కట్టడి

- ప్రజలు నిర్లక్ష్యంగా ఉండరాదు
- మాస్క్, భౌతికదూరం తప్పనిసరి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్



డాక్టర్ సునీల్

నిర్మల్‌చైన్‌గేట్: మళ్లీ కోవిడ్ ముంచుకొస్తోందనీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ సూచించారు. వైరస్‌ను ఎదుర్కొనేందుకు ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన జిల్లా పరిస్థితులు, వైద్య సౌకర్యాలు, ఏర్పాట్లపై వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: జిల్లా జనరల్ ఆస్పత్రిలో బెడ్స్ అందుబాటులో ఉన్నాయా?
జవాబు: ఆస్పత్రిలో ప్రత్యేక వార్డుతో పాటు 10 వెంటిలేటర్, 91 ఆక్సిజన్, 100 సాధారణ బెడ్స్ అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: కోవిడ్ కేసులు పెరిగితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?
జవాబు: జిల్లా జనరల్ ఆస్పత్రిలోఐసోలేషన్, ఐసీయూ, కోవిడ్ కేర్ వార్డులు ఏర్పాటు చేస్తున్నాం. ఫిజీషియన్లు, పల్మనాలజిస్టులు, సివిల్ సర్జన్లతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సేవలందిస్తాం.

ప్రశ్న: ఆస్పత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది ఉన్నారా?
జవాబు: ప్రస్తుతం ఇద్దరు ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 17 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 21 మంది సీనియర్ రెసిడెంట్లు అందుబాటులో ఉన్నారు. ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్లను సిద్ధంగా ఉంచాం.

ప్రశ్న: జిల్లాలో ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ పరీక్షల కోసం ఏర్పాట్లు చేశారా?
జవాబు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆర్టీపీసీఆర్ ల్యాబ్ ద్వారా పరీక్షలు చేస్తాం. భైంసా ఏరియా ఆస్పత్రి, ఖానాపూర్, నర్సాపూర్ సీహెచ్‌సీలలో పరీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కిట్లు రాగానే పరీక్షలు ప్రారంభిస్తాం.

ప్రశ్న: కరోనా వచ్చిందని ఎలా గుర్తించాలి?
జవాబు: వాసన లేకపోవడం, దగ్గు, జ్వరం, ముక్కుకారడం తీవ్రమైన ఒళ్లు నొప్పులు, మూడు నుంచి 5 రోజుల పాటు ఉంటే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి కరోనా టెస్ట్ చేయించుకోవాలి. ఒక వేళ కరోనా పాజిటివ్ వస్తే ఇంట్లోనే చికిత్స తీసుకోవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అన్ని వసతులు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: కోవిడ్ వ్యాప్తి చెందకుండా ఎలాంటి నివారణ చర్యలు తీసుకుంటున్నారు.
జవాబు : ఇప్పటి వరకూ జిల్లాలో కేసులు నమోదు కాలేదు. వైరస్ నివారణ కోసం ప్రజలు మాస్కులు ధరించాలి. సానిటైజర్, భౌతిక దూరంపై అవగాహన పెంచుతాం.

ప్రశ్న: కరోనా ఎదుర్కొనేందుకు ఎలాంటి సౌకర్యాలు కల్పించారు?
జవాబు : జిల్లాలోని జనరల్ ఆస్పత్రుల్లో పడకలు, ఐసోలేషన్ వార్డు సిద్ధం చేశాం. 24 గంటలూ వైద్య సేవలందిస్తాం. కేసులు పెరిగితే జనరల్ పడకలు కరోనా పేషెంట్లకు కేటాయిస్తాం.

ప్రశ్న: చిన్న పిల్లలకు కరోనా వస్తే ఏంచేయాలి?
జవాబు : సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించాలి. వైద్యుల సలహాతో మాత్రలు వాడాలి.

ప్రశ్న: కొత్త వేరియంట్‌ను తట్టుకునేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలి?
జవాబు: కొత్త వేరియంట్ సోకితే మంచి ఆహారం తీసుకోవాలి. నిద్ర ఉండాలి. మాస్కులు ధరించాలి. తాజాపండ్లు, కూరగాయలు తీసుకోవాలి.

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

- దస్తురాబాద్ ఎస్సైకి మహోన్నత సేవా పతకం
- పలువురికి ఉత్తమ సేవా పతకాలు

నిర్మల్: రాష్ట్ర పోలీసుశాఖ కొత్త ఏడాదిలో సిబ్బందికి సేవా పతకాలను ప్రకటించింది. ఇందులో జిల్లా నుంచి పలువురు అధికారులు, కానిస్టేబుళ్లు ఉన్నారు. దస్తురాబాద్ ఎస్సై బి.ప్రభాకర్‌రెడ్డికి మహోన్నత సేవాపతకం, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డికి సేవా పతకం వచ్చింది. మహోన్నత సేవా పతకం వచ్చిన వారికి రూ.40 వేలు, ఉత్తమ సేవా పతకం వచ్చిన వారికి రూ. 30వేలు, సేవా పతకం కింద రూ.20వేలు ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ జితేందర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పతకాలు వచ్చినవారు..
మహోన్నత సేవాపతకం : బి. ప్రభాకర్‌రెడ్డి, ఎస్సై, దస్తురాబాద్

ఉత్తమ సేవాపతకం :
జే.రాందాస్, ఏఎస్సై, కుంటాల
ఎం.జ్యోతిరామ్, ఏఆర్‌హెచ్‌సీ, ఏఆర్, నిర్మల్
జే.బాలాజీ, హెడ్‌కానిస్టేబుల్, దిలావర్‌పూర్

సేవాపతకం :
ఏ.గంగారెడ్డి, డీఎస్పీ, నిర్మల్
ఎస్.సాహెబ్‌రావు, ఏఆర్‌ఎస్సై, నిర్మల్
షబ్బీర్‌ఖాన్, హెడ్‌కానిస్టేబుల్, మామడ
ఏ.శంకర్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, నిర్మల్
ఎస్.రాజేశ్వర్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, నిర్మల్
ఎస్.సుదర్శన్‌బౌద్ధ్, ఏఎస్సై, ముధోల్

ఫైర్‌సర్వీస్(సేవా పతకం) :
ఏ.వెంకటేశ్వర్లు, స్టేషన్‌ఫైర్ ఆఫీసర్, ఖానాపూర్

న్యూస్‌రీల్

అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి



డా. వెల్మల మధు



డా. పవన్‌కుమార్

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెల్మల మధు(బాటనీ), డాక్టర్ పవన్‌కుమార్(హిందీ)కు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రాములోరి అక్షింతలతో శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న రామభక్తులు

భైంసా: అయోధ్యలో ప్రతిష్ఠించబోయే శ్రీరాములోరి అక్షింతలతో సోమవారం బాసరలోని ప్రధాన వీధులగుండా శోభాయాత్ర నిర్వహించారు. బాసర, మైలాపూర్ గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం దత్తాత్రేయ స్వామి చెంత అక్షింతలు ఉంచారు. రామ మందిర నిర్మాణంలో ప్రజలంతా భాగస్వాములైనందున జనవరి 15 వరకు శ్రీరాములోరి అక్షింతలు ప్రతీ ఇంటికి చేర్చనున్నట్లు రామభక్తులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దేవరకోటలో సుదర్శన యాగం

నిర్మల్‌టౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని దేవరకోట ఆలయంలో మంగళవారం సుదర్శన యాగం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమం ఉంటుందన్నారు.

రసవత్తరం ఖానాపూర్ మున్సిపల్ రాజకీయం

- క్యాంపునకు తరలిన కౌన్సిలర్లు
- వీడీసీలు వర్సెస్ కౌన్సిలర్లుగా అవిశ్వాస ప్రక్రియ



క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ రాజకీయం కొద్దిరోజులుగా రసవత్తరంగా సాగుతోంది. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు రెండు రోజుల క్రితం క్యాంపునకు తరలివెళ్లారు. ఖానా పూర్‌లో అభివృద్ధి కుంటుపడడానికి కారణమైన చై ర్మన్, వైస్ చైర్మన్‌లను తొలగించడమే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 9 మంది కౌ న్సిలర్లు పార్టీలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి ఖా నాపూర్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్లేందుకు అవిశ్వాసం ప్రవేశపెట్టినట్లు పేర్కొంటున్నారు.

పోటాపోటీగా ఫిర్యాదులు
ఏడాది క్రితమే కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి అవిశ్వాసం పెట్టాలని కోరారు. కోర్టు స్టే కారణంగా ఏడాది కాలంగా ఆ ప్రక్రియ సాగలేదు. ఇటీవల ఎన్నికలు ముగియడంతో పాటు కోర్టు స్టే ఎత్తివేయడంతో కౌన్సిలర్లు అవిశ్వాసం విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 14న నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. అవిశ్వాస నోటీసుకు సంబంధించి ప్రత్యక్షంగా కౌన్సిలర్లు సంతకాల ధ్రువీకరణ చేయడంతో పాటు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 5న అవిశ్వాసం జరగనున్న నేపథ్యంలో ఒక్కసారిగా అవిశ్వాసానికి రాజకీయ రంగు పులుముకుంది. ఇదిలా ఉంటే అవిశ్వాస ప్రక్రియ సరికాదని, ఖానాపూర్ అభివృద్ధి దృశ్యా వెనక్కితీసుకోవాలని వీడీసీలు కోరుతుండగా తాము చట్టబద్ధంగా పెట్టే అవిశ్వాసాన్ని తప్పుపడుతూ అవిశ్వాసంపై వీడీసీ అజమాయిషి చేయడం సరికాదని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటుండగా వీరి పంచాయతీ పోలీస్ స్టేషన్‌లకు చేరింది. కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు ఎస్పీకి ఫిర్యాదు చేయగా వీడీసీల నాయకులు చిన్నసత్యంపై ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌పై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వీడీసీ నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యంపై ఖానాపూర్, తిమ్మాపూర్ వీడీసీ నాయకులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాము అవిశ్వాస నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరామని, ఎవరినీ బెదిరించలేదన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న సత్యంపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రాజన్న, నారాయణ, గంగాధర్, శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన అయ్యప్ప స్వాములు



ఎంపీకి అయ్యప్ప ఫొటో అందిస్తున్న సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావును ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలిసి అయ్యప్ప ఫొటోను అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తనవంతుగా రూ.20 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న, అర్చకులు జగన్నాథం విజయ్, సభ్యులు సట్ల శంకర్, మైలారపు భూవర్తన్, శ్రీనివాస్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.



గండి రామన్న సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఆలయాలకు 'కొత్త' కళ

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. జిల్లా కేంద్రంలోని గండి రామన్న సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సాయిబాబా హారతికి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. నగరేశ్వర్ వాడలోని శివాలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి శివుడిని దర్శించుకున్నారు. దేవరకోట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి భక్తులు బారులుతీరారు.

- సాక్షి ఫొటో గ్రాఫర్, నిర్మల్



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు



గండి రామన్న సాయిబాబా ఆలయం ముందు భక్తుల రద్దీ



గోశాలలో కృష్ణయ్యకు మొక్కుతున్న మహిళలు



ఫౌంటేన్ వద్ద సెల్ఫీ దిగుతున్న యువతులు

క్లుప్తంగా

కార్మికుల హక్కుల సాధనకు కృషి

ఎదులాపురం: కార్మికుల హక్కుల సాధన కోసం కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సీడబ్ల్యూసీ వద్ద సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ కార్మికులు సోమవారం ఏఐటీయూసీలో చేరగా వారికి యూనియన్ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జెండాను ఆయన ఆవిష్కరించారు. దేవేందర్, చౌహాన్, సాంబాజి తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల బామ్మ.. బర్త్‌డే



బామ్మ కాళ్లు కడుగుతున్న కుటుంబ సభ్యులు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో వందేళ్ల వృద్ధురాలికి కుటుంబ సభ్యులు సోమవారం బర్త్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అడన్కర్ రాధాబాయి వయస్సు సెంచరీ పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె కుమారులు ఓంకార్, గంగాధర్, చంద్రకాంత్, కూతురు అనితతో పాటు కుటుంబ సభ్యులు కలిసి సంప్రదాయం ప్రకారం తల్లి పాదాలు కడిగారు. అనంతరం కేక్ కట్ చేశారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: దాడిచేసిన ముగ్గురిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. టూటౌన్ ఎస్సై ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన పిల్లలు రోడ్డుపై ఆడుకుంటున్నారు. ఆ సమయంలో అదే కాలనీకి చెందిన సందేశ్, ప్రీతమ్, వికాస్‌లు బైక్‌పై కాలనీలో తిరుగుతూ ఇబ్బందులకు గురిచేశారు. ఈ విషయమై ఫిర్యాదుదారుడు దస్సరే బాబు వారితో మాట్లాడగా ఆ ముగ్గురు ఆయనపై దాడికి దిగారు. ఈ మేరకు ఆయన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కోటపల్లిలో చిరుత సంచారం



ఆయిల్‌పాం తోటలో చిరుత పాదముద్రలు

కోటపల్లి: మండలకేంద్రానికి అనుకుని ఉన్న ఎంపీపీ సురేఖ ఆయిల్‌పాం తోట సమీపంలో చిరుతపులి సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చెన్నూర్ మండలం బుద్దారం, సంకారం మీదుగా ప్రయాణం చేసి కోటపల్లి నుంచి శంకరాపూర్ మీదుగా వెళ్లి ఉంటుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. రైతు రామయ్య సమాచారంతో ఆయిల్‌పాం తోటలో చిరుత పాదముద్రలను గుర్తించారు. అటుగా మామిడి తోటలు, పత్తి చేన్లకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు.

ట్రిపుల్.. ట్రబుల్స్ తీరేనా?

- సీఎంనే ఆనాడు రానివ్వలేదు
- ప్రధాన గేటు ముందే గవర్నర్ మీడియా సమావేశం
- ఎవరొచ్చినా లోపలకు నో ఎంట్రీ
- ప్రధాన ద్వారం వద్ద ఆంక్షలు
- తల్లిదండ్రులకు మాట్లాడే చాన్స్‌లేదు
- సీఎం రాక కోసం విద్యార్థుల ఎదురుచూపులు



బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ అంటే రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలిసిందే.. ఇక్కడ చదివే పిల్లల ఇబ్బందులు, ఆందోళనలు, నిరసనలు ఇలా ఏదో ఒక విషయంలో ట్రిపుల్‌ఐటీ ఎప్పుడు వార్తల్లో నిలిచేది. బాసరలో 2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ట్రిపుల్‌ఐటీని ప్రారంభించారు. కొన్నేళ్లుగా ఇక్కడి విద్యార్థులు సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేక సమస్యలు పరిష్కారం కాక ఇప్పటికీ అక్కడ చదివే విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ రహస్య క్యాంపస్‌గా మారింది. మీడియాకు, విద్యార్థి సంఘాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, మేధావులకు ఎవరైనా సరే లోపలికి అనుమతించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు చదివే ఈ విశ్వవిద్యాలయంలో ఏమి జరుగుతుందోనని తెలియక పోషకులు ఆందోళనకు గురవుతున్నారు.

మీడియాకు నో ఎంట్రీ

2022 ఆగస్టు 7న బాసర ట్రిపుల్‌ఐటీకి గవర్నర్ హోదాలో తొలిసారి వచ్చిన తమిళిసై పర్యటన కవరేజీకి వెళ్లిన మీడియాను అధికారులు అనుమతించలేదు. ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారాన్ని మూసివేసి ఉంచారు. మీడియాతో పాటు ఉదయం వేళ ట్రిపుల్ ఐటీలో పనిచేసే సిబ్బందిని కూడా అనుమతించలేదు. గవర్నర్ బాసర ట్రిపుల్‌ఐటీ నుంచి నిజామాబాద్ తెలంగాణ యూనివర్సిటీకి వెళ్లే సమయంలో ప్రధాన ద్వారం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడే మీడియాతో గవర్నర్ తమిళిసై మాట్లాడారు.

ఇప్పటికైనా మారేనా?

నాటి ప్రభుత్వంలో బాసర ట్రిపుల్‌ఐటీలో ఆంక్షల



2022 ఆగస్టు 7న ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద గవర్నర్ మీడియా సమావేశం (ఫైల్)

పేరుతో ఎవరిని అనుమతించలేదు. డిసెంబర్ 7న తెలంగాణ సీఎంగా పదవీ ప్రమాణం స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చారు. ప్రజాభవన్‌గా మార్చి అక్కడే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో మాత్రం నేటికి పాత ఆంక్షలే కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా కల్పించడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి నేరుగా బాసర ట్రిపుల్ ఐటీకి వచ్చి సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి మార్గం చూపుతారని ఇక్కడి విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

తీరిక లేక..

విద్యార్థులకు ప్రతీరోజు క్రీడలు ఆడుకునేలా షెడ్యూల్ ఉంచాలి. ఉదయం నిద్రలేవగానే రాత్రి పడుకునే వరకు స్నానాలు, భోజనాలు, తరగతి గదులు వీటితోనే రోజు పూర్తి అవుతుంది. క్రీడల్లో ఉన్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి కాస్త దూరమవుతారు. వారంలో ఒక్కరోజైన చెవులకు ఇంపైనా సంగీతం, వినోద కార్యక్రమాలు తిలకించే ఏర్పాట్లు చేయాలి. అవేవి ఇక్కడ జరగడం లేదు. విద్యార్థుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సైకాలజిస్టులతో కౌన్సెలింగ్‌లు ఇప్పిస్తూ మానసికస్థితిని తెలుసుకోవాలి. ఒంటరిగా ఉండే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిచి గతంలో ఎలా ఉండేవారు. ఇప్పుడు ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారనే విషయాలను చర్చించాలి. ఇకనైనా విద్యార్థులపై శ్రద్ధ వహించాలని పలువురు కోరుతున్నారు.

నేటి సీఎంకు అప్పట్లో నో ఎంట్రీ...



2022 జూన్ 17న అప్పటి పీసీసీ చీఫ్ నేటి సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

నేటి సీఎం రేవంత్‌రెడ్డికే అప్పట్లో బాసర ట్రిపుల్‌ఐటీలో అనుమతించ లేదు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు గోడ దూకివచ్చిన పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. మళ్లీ గేటుద్వారా బయటకు పంపించారు. ప్రస్తుతం ఆయన సీఎంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని విద్యార్థులు భావిస్తున్నారు.

విగ్రహాలకు రక్షణేది?



నిర్మల్‌లోని చైన్‌గేట్ సమీపంలో రాంజీగోండు, కుమురం భీం విగ్రహాలను నూతనంగా ఏర్పాటు చేశారు. కాని అధికారులు రక్షణ చర్యలు తీసుకోలేదు. దీంతో మందుబాబులకు అడ్డాగా మారింది. పట్టపగలే మద్యం తాగుతున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, తినుబండారాలతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. వ్యాపారులు సైతం బజ్జీల బండ్లు ఏర్పాటు చేసుకున్నారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





రాకేశ్‌కు అందుతున్న ఆర్థికసాయం

సాక్షి స్పందన

భైంసాటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రాకేశ్‌కు దాతల నుంచి ఆర్థికసాయం అందుతోంది. 'ఆపన్నహస్తం అందించరూ..'శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి పలువురు స్పందిస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా ఆదిలాబాద్‌తో పాటు అమెరికా, దుబాయ్ నుంచి సైతం పలువురు తమకు తోచిన ఆర్థికసాయాన్ని ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా అందిస్తున్నారు. రాకేశ్ స్నేహితులు సామాజిక మాధ్యమాల ద్వారా సాయం అందించాలని దాతలను కోరుతున్నారు. ఇప్పటివరకు దాతల



ఆర్థికసాయం అందిస్తున్న తూమోల్ల దత్తాత్రి

నుంచి రూ.4.50 లక్షల ఆర్థికసాయం అందినట్లు తెలిపారు. ఆపరేషన్ కోసం రూ.8 లక్షల వరకు అవసరమని వైద్యులు పేర్కొన్నారని, దాతలు మరింత స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

'ఎల్లలు దాటిన మానవత్వం'

జన్నారం: మానవత్వం ఎల్లలు దాటింది. మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన బరుకుంట పోషన్న గత 12 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లాడు. అక్కడ రియాజ్ మహ్మద్ సైఫ్‌కు చెందిన కంపెనీలో కార్మికుడిగా చేరాడు. గత ఆరునెలల క్రితం పోషన్న స్వగ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో అనారోగ్యం బారినపడ్డాడు. వైద్యపరీక్షల్లో క్యాన్సర్ అని తేలింది. ఈ విషయం తెలియడంతో రియాజ్ మహ్మద్ సైఫ్ అతని వైద్యఖర్చుల కోసం డబ్బులు పంపించారు. సోమవారం ఆయన కలమడుగుకు వచ్చి పోషన్నను పరామర్శించారు. తర్వాత గ్రామంలోని మసీద్‌లో ప్రార్థనలు చేశారు. మసీద్ మరమ్మతుకు ఆర్థికసాయం అందజేస్తానని



కలమడుగు గ్రామస్తులతో రియాజ్ మహ్మద్ సైఫ్

తెలిపారు. ముస్లింలకు అనాథ పిల్లలకు రూ.12 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా సైఫ్‌ను సాక్షి పలుకరించగా, ఏళ్లుగా ఇంట్లో వ్యక్తిలా పనిచేసిన పోషన్నను పరామర్శించేందుకు ఇక్కడికి వచ్చానని తెలిపారు. మానవత్వం చాటిన సైఫ్‌ను గ్రామస్తులు అభినందించారు.

కౌన్సిలర్‌ను అరెస్టు చేయాలి



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రానికి చెందిన దళిత యువకుడు ఎంబడి వంశీ హత్యకు యత్నించిన పాల్పడిన కౌన్సిలర్ ఉష్కం రఘుపతి, ఉష్కం అరుంధతిలను అరెస్టు చేయాలని అంబేద్కర్ సంఘాల ఐక్యపోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని దళిత కులాలతో కలిసి ఈనెల 3న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. 6న ఆదిలాబాద్ పట్టణ బంద్‌కు పిలుపునిస్తామన్నారు. 8న మంత్రులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్లను కలిసి వినతిపత్రాలు అందిస్తామన్నారు. తాము చేపట్టే కార్యక్రమాలకు పోలీసులు సహకరించాలని కోరుతూ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. నిందితులను అరెస్ట్ చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. సమావేశంలో భూమన్న, నవీన్, నగేశ్, ప్రశాంత్, చందాల రాజన్న, దయాకర్, దేవిదాస్, సత్యనారాయణ, సుదర్శన్, శంకర్, చిన్నయ్య, శోబతాయి పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

భైంసారూరల్: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని సిద్దూర్ గ్రామానికి చెందిన దిగాంబర్ (70) గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో సోమవారం ఇంటి నుంచి వెళ్లి గ్రామసమీపంలోని శివారు ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాపల్ ప్రాంతంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై చంద్రకుమార్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కోటేశ్ మందమర్రి ఏరియాలోని కేకే-ఓసీలో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎప్పటిలాగా ఉదయం పని నిమిత్తం బైక్ పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మందమర్రిలోని ఇందిరానగర్‌కు చెందిన మహేశ్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనలతో కోటేశ్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మీ జవాన్ మృతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రిమ్స్‌లో ఆర్మీ జవాన్ మృతిచెందాడు. టూటౌన్ ఏఎస్సై ముకుంద్ రావు కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా ఝరి తాలుకా పాటన్‌కు చెందిన ఆర్మీ జవాన్ ముకే రవీంద్ర(35) ఛాతీనొప్పితో బాధపడుతుండగా కుటుంబీకులు రిమ్స్‌కు సోమవారం తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు

కాసిపేట: డ్రైవర్ అజాగ్రత్తతతో వాహనం నడిపి ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నస్పూర్‌కు చెందిన రవీందర్ భార్య నిర్మల, కూతురు స్వాతి ఆదివారం రాత్రి సోమగూడెం సమీపంలోని కల్వరి చర్చిలో ప్రార్థనలకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ ఉరాడే భరత్ తన గూడ్స్ క్యారియర్ వాహనాన్ని అజాగ్రత్తగా వేగంగా నడుపుతూ వారిని ఢీకొట్టారు. తీవ్రగాయాలైన వారిని బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందారు. భర్త రవీందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమ్మేసిన పొగమంచు

లోకేశ్వరం మండలంలోని ధర్మోర, పంచగుడి, లోకేశ్వరం, వట్టోలి గ్రామాలు, లక్ష్మణచాంద మండలకేంద్రం, రోడ్డు మార్గాల్లో సోమవారం పొగమంచు కమ్మేసింది. పంట పొలాలు, రోడ్డు మార్గాల్లో దట్టమైన పొగ మంచు వల్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు తగ్గలేదు.
- లోకేశ్వరం/లక్ష్మణచాంద



లక్ష్మణచాంద సమీపంలో..



లక్ష్మణచాంద: రాచాపూర్-మూటాపూర్ మార్గంలో..



లోకేశ్వరంలో..

నరేంద్రాచార్య మహారాజ్‌ను కలిసిన ఎమ్మెల్యే



నరేంద్రాచార్య మహారాజ్‌తో రామారావుపటేల్

భైంసాటౌన్: నానిజ్‌ధామ్ దక్షిణ భారత్ పీఠాధిపతి నరేంద్రాచార్య మహారాజ్‌ను ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ కలిశారు. జుక్కల్‌లో సోమవారం నిర్వహించిన సమస్య మార్గదర్శన, దర్శన సమారోహ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన్ను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పలువురు ఉన్నారు.

నాలుగేళ్ల బాబు కిడ్నీల్లో రాళ్లు

నిర్మల్: వయసుతో సంబంధం లేకుండా కిడ్నీలో రాళ్లు తయారవుతున్నాయి. కేవలం నాలుగేళ్ల చిన్న వయసులోనే ఓ బాబు రెండు కిడ్నీల్లో రాళ్లు కావడంతో నొప్పి భరించలేక కొన్ని రోజులుగా విలవిలలాడిపోయాడు. సోన్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాబు కొంతకాలంగా కిడ్నీలో రాళ్లతో బాధపడుతున్నాడు. తెలిసిన వారి ద్వారా బాబును తీసుకుని తల్లిదండ్రులు జిల్లాకేంద్రంలోని డాక్టర్స్ లైన్‌లో గల స్వప్న హాస్పిటల్‌కు వచ్చారు. జనరల్ సర్జన్ శశికాంత్, కిడ్నీ వైద్యనిపుణుడు శ్రావణ్ బాబు రెండు కిడ్నీల్లో రాళ్లు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యంగా ఉన్నాడని వారు చెప్పారు. ఇలాంటి కిడ్నీ సంబంధిత వ్యాధులకు, కార్పొరేట్ స్థాయిలో నిర్మల్‌లోనే చికిత్స పొందవచ్చని వైద్యుడు శశికాంత్ చెప్పారు.

ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి పాటుపడాలి



నూతనంగా ఎన్నికైన అడహక్ కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి పాటుపడాలని నాయకులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పిట్టల్‌వాడలో గల ఆదివాసీ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విభేదాలు పక్కనపెట్టి అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. అందులో భాగంగా మండల, డివిజన్ స్థాయి కమిటీలు నియమించాలన్నారు. ఫిబ్రవరిలో జరిగే హీరాసుక్కా జయంతి విజయవంతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈనెల 7న బేల, జైనథ్, 9న తాంసి, తలమడుగు, 11న ఆదిలాబాద్, గుడిహత్నూర్, 12న భీంపూర్ మండలాల కమిటీలను ఎన్నుకుంటామన్నారు.సమావేశంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, విజయ్, దేవిదాస్, రామాకాంత్, శివకృష్ణ పాల్గొన్నారు.

అడహక్ కమిటీ ఎన్నిక..

ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా పూసం ఆనంద్‌రావ్, కుర్సెంగే తానాజీ, నైతం శుక్లాల్, పూసం ప్రభాకర్, గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, గేడం విఠల్, మెస్రం ఈశ్వర్, మడావి దిగంబర్, మెస్రం భాస్కర్, ఆత్రం అనుసూయ, గంగాదేవి ఎన్నికయ్యారు.

అ'పూర్వ' సమ్మేళనం



స్థానిక కుంటాల ఉన్నత పాఠశాలలో 2002-03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. సోమవారం నిర్వహించిన అపూర్వ సమ్మేళనంలో పాల్గొని రోజంతా సంతోషంగా గడిపారు. న్యూఇయర్ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. పాఠశాలలో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. - కుంటాల